# ఒక దోమ కథ

''నేను చాలా కథలు విన్నాను. చాలా కథలు చదివాను. వాటిల్లో రాజకుమారులు, రాజకుమార్తెలు, మాయగాళ్లు, మంత్రగాళ్ళు, దేవుళ్ళు, దెయ్యాలు, భూతాలు, ప్రేతాలు, రెక్కల గుర్రాలు, చుక్కల పర్వతాలు, మాయ లోకాలు, కోయ గూడేలు, మాటాడే పక్షులు, ఆటాడే యక్షులు, చిత్రాలు, విచిత్రాలు... చాలా చాలా వచ్చిన మాట నిజం! ఇల్లలుకుతూ, అలుకుతూ పేరు మరిచిపోయిన ఈగ కథ విన్నమాటకూడా నిజం! ఆ కథల్లో ఎక్కడా నాకు బంగారు దోమ తగల్లేదు. ఇంత కాలానికి నువ్వు వచ్చావు. చాలా సంతోషం! కూచో! నీ కథా కమామిషూ చెప్పకురా" అన్నాను, నా ముఖం ముందు అటూ ఇటూ తిరుగుతున్న బంగారు దోమను.

అది కాస్సేపు నా ముఖంలోకి చూసింది. చూశాక దగ్గరకొచ్చింది. వచ్చాక - ఏమనుకోన్నదో ఏమో చటుక్కున ఎగిరి కాస్త అవతలిదాకా వెళ్ళింది.

''చెప్పడం ఇష్టంలేదా ఏం?" అన్నాను.

"ఎందుకు లేదూ? చెబుదామనే ఉంది. అసలా ఉద్దేశంతోనే వచ్చాను. అయితే నా అనుమానా లేవో నా కున్నాయి. కన్ను పోయేంత కాటుక పెట్టుకోవడం నా కిష్టం లేదు. కథ చెబుతాను గానీ - కాస్తంత దూరంగా ఉండి చెప్పడం ఎందుకయినా మంచిదని పిస్తున్నది. ఎంతయినా నీవు మనిషివి. నేను బంగారు దోమను. మామూలు దోమమీద అసహ్యా ముంటుందంటే నమ్ముతాను గానీ, బంగారు దోమమీద ఉంటుందంటే నమ్మ బుద్ధి కావడంలేదు" అన్నది దోమ, అల్లంత దూరంనుంచే నన్ను పరిశీలనగా చూస్తూ.

"నువ్వనేగాదు - నీ స్థితిలో ఎవరున్నా అచ్చంగా నీలానే అనుకొంటారు. మనుషుల్ని గురించి నీకు తెలియందేముంది గనుక! కాసుకోసం కన్న తల్లినయినా హత్య చేసేవాళ్ళు - మాలో చాలా మంది ఉన్నారు. ఆపాటి దూరంగానే ఉండి నీ కథ చెప్పుకురా చాలు" అన్నాను.

ఏమనుకున్నదో ఏమోగానీ - దోమ కాస్త ముందుకొచ్చింది ఎదుర్రొమ్ము మీదున్న పుస్తకం అంచున వాలింది. ఒకసారి ముందు కాళ్ళు అలా ఇలా కదిపింది. కదిపి - కథ చెప్పడం ప్రారంభించింది!

* * *

రత్నగిరిని రాజధానిగా చేసుకొని, సువిశాలమైన రాజ్యాన్ని పాలించిన రత్నవర్మ మహా వీరుడు, మహా శూరుడు, మహా పండితుడు కాదు గానీ - ఆయన ఆస్థానంలో చాలామంది కవులు, పండితులూ ఉన్నారు. ఆయన రాజ్యాని కొచ్చేనాటికి దాని విస్తీర్ణం అరవై యోజనాలు కూడా లేదు. అంత చిన్న రాజ్యాన్ని ఆయన ఆరు వందల యోజనాల విస్తీర్ణానికి పెంచాడు. ఆయన రాజ్యాని కొచ్చేనాటికి ఒక చిన్న కోశాగారం - అదీ అరకొరగా ఉండేది. దాన్ని నింపడానికి, ఆ ప్రభువుకు ఆరు మాసాలు కూడా పట్టలేదు. ఆ తరువాత వచ్చిపడిన సంపదను దాచడానికి, ఆ కోశాగారం సరిపోలేదు. అందుకని బ్రహ్మాండమైన మరో సౌధాన్ని కోశాగారం కింద మార్చేశారు ఇప్పుడదీ నిండిపోయింది.

"అనవసరం ఇంకో కోశాగారం కట్టకండి... ఆశకు అంతు లేదు. ఇప్పటిదాకా సంపాదించింది చాలు. డబ్బు పరమ పాపిష్టిది. మీకు తెలుసునో లేదో మరి, దానికో దుర్గుణముంది. దాన్ని పెంచుతున్న కొద్దీ, ఇంకా ఇంకా పెంచమంటుంది. ఈ పెరుగుదలకు మనం లొంగిపోయామో, అది మనల్ని కుక్క నాడించునట్లు ఆడి

స్తుంది. నా కిప్పుడు ధన కాంక్ష లేదు. కీర్తి కాంక్ష లేదు. సంపాదించిన డబ్బును సద్వినియోగం చేయాలన్న ఆలోచన కలుగుతున్నది." అన్నాడు రత్నవర్మ.

"చాలా గొప్పగా ఉంది తమ ఆలోచన!" అన్నారు వంది మాగధులు.

తను సంపాదించిన డబ్బును రాజుగారు ఎలా సద్వినియోగం చేయబోతున్నదీ ఎవరికీ తట్టలేదు. ఆయనగారు ఎవర్నీ అడగను కూడా అడగలేదు.

వారం రోజులు తిరక్కుండానే, తాము చేయబోతున్న సత్కార్యమేమిటో రాజుగారే స్వయంగా బయట పెట్టారు.

"అన్ని దానాలలోకి ఏ దానం గొప్పదో నేను చప్పున తేల్చు కోలేకపోయాను. ఆలోచించగా, ఆలోచించగా, ఆలోచించగా— అన్నదానం గొప్పదని నా బుద్ధికి తోచింది. ఫలానా రోజునుండే మనం అన్నదానం చేదాం! అందుకు కావలసిన ఏర్పాట్లన్నీ చూడండి!" అన్నారు ప్రభువులవారు.

ఆ ఫలానా రోజు రానే వచ్చింది. అన్నదానం అందుకోవడా నికి జనం బారులు తీరి నిలబడ్డారు. ఆవురావురుమంటూ, ముక్కా నోటా కొట్టుకొంటున్న ఆ జనాన్ని చూసి, రత్నవర్మ ప్రభువుల వారు అతురాలా పొంగిపోయారు.

"ఇదో కొత్త బులపాటం. నెల తిరక్కుండానే రాజావారికి దానంమీద మొఖం మొత్తి తీరుతుంది" అన్నారు కొంతమంది శకున పక్షులు.

అబద్ధం!
అలా జరగనే జరగ లేదు.

నెల - రెండు నెలలు - ఆరు నెలలు - పది నెలలు - ఏడాది కూడా గిర్రున తిరిగి పోయింది. రాజుగారికి అన్నదానంమీద మొఖం మొత్తలేదు సరేగదా - దానిమీది ఆపేక్ష రెండింతలూ, మూడింతలూ అయింది. ఇలా అవడానికి, ఆస్థాన కవులూ, గాయనీ గాయకులూ సాయం పట్టారు.

రత్నవర్మగారి దాన గుణాన్ని వర్ణిస్తూ కవులు కావ్యాలు రాశారు. గాయనీగాయకులు గానం చేశారు. ఆ కావ్యాలు దేశమంతటా పాకాయి. ఆ కవితలు, ఆ నోటా ఈ నోటా పడి మారుమూలల క్కూడా వ్యాపించాయి.

తను చేసిన సత్కార్యాన్ని గురించి ఎవరెవరు ఏమనుకుంటున్నదీ తెలుసుకుందామన్న సదాలోచన ఏలినవారికి కలిగింది. వారు మారువేషంలో దేశమంతా పర్యటించారు. ఏనోట విన్నా తన అన్న దానాన్ని గురించే కావడంతో - ఆయనగారికి తనుచేసింది మంచి పనేనన్న విశ్వాసం బలపడింది. ఇది నిజంగా సత్కార్యమే అయినప్పుడు, దీన్నింకా విస్తృతంగా ఎందుకు చేయకూడదు? 'నభూతో నభవిష్యతి' అని ఎందుకు అనిపించుకో కూడదు? అనితర సాధ్యమన్న స్థాయిలో ఎందుకు నడిపించ కూడదు?

రత్నవర్మగారి అన్నదాన కార్యక్రమాన్ని అభినందించడంలో కవుల మధ్య పోటీ పెరిగింది. ఆ పోటీలో నెగ్గుకు రాలేక పోయిన ఒక కవిగారికి మనస్సు చివుక్కుమన్నది! ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఇతగాడిదీ తక్కువ చెయ్యిగాదు. తన సమస్త శక్తులనూ ధారపోసి అద్భుతమైన కావ్యం రాసుకొచ్చాడు. అది చూసిన మిగతా కవులకు కడుపు మండిపోయింది. అందరూ కూడబలుక్కొని, దాన్నొక నాసిరకం కావ్యంగా తీర్పు చెప్పారు.

"తమలాంటి అవతార పురుషుణ్ని గురించి ఇంత చవక

ఖారుగా రాసిన ఈ కవిని శిక్షించవద్దనీ, క్షమించి వదిలివేయవలసిందనీ మేం ప్రార్థిస్తున్నాం" అన్నారు మిగిలిన కవులందరూ.

తన కావ్యం చాలాగొప్పదనీ, ఈ కవులందరూ కట్టగట్టుకొని తనమీద కుట్ర నడిపారనీ, ఇంకెవరిచేతనయినా, తన కావ్యాన్ని పరీక్ష చేయించి, అది ఉత్తమోత్తమ కావ్యం కాదని రుజువయితే తనకు శిరచ్ఛేదం చేయించవలసిందనీ - ఆ కవిగారు రాజుగారితో చెప్పుకొందా మనుకున్నాడు. ఇక ముందు ముందు ఎప్పుడో ఒక ప్పుడు, ఏదో ఒక మార్గాన ఈ కవిగారు రాజుగారిని కలుసుకొని, తన కావ్య విశిష్టతను రుజువు చేసుకొనే ప్రమాదం రాకుండా ఉండే టందుగ్గాను, అతన్ని దేశంనుండి పంపించివేయడం మంచిదని కూడా వారిలో కొందరనుకున్నారు. అలాగని రాజుగారికి సలహా కూడా ఇచ్చారు.

ఆ సలహా మేరకు -"వీరిని సగౌరవంగా మన దేశ సరిహద్దుల్ని దాటించి రండి" అని భటులను ఆదేశించారు ప్రభువులవారు.

శ్రీవారి ఆజ్ఞ మేరకు కవిగారిని — రత్నగిరి సరిహద్దుల్ని దాటించి, ఆ పక్కనే ఉన్న ఉదయగిరి రాజ్యంలో ప్రవేశపెట్టి, వెళ్ళిపోయారు భటులు.

మూడు రోజుల ప్రయాణం తరువాత రాజధానీ నగరం చేరు కొని, ప్రభువులయిన ఉదయవర్మగారిని దర్శించి, తనను తాను పరి చయం చేసుకొన్నారు కవిగారు.

"మహాప్రభూ! నేను రత్నగిరి రాజ్య బహిష్కృతుణ్ని. ఆ మహారాజుగారు చేస్తున్న అన్నదాన కార్యక్రమాలను కనులారా చూసి, పొందిన అనుభూతితో, నేనొక మహాకావ్యం రాశాను. నా గ్రంథాన్ని గురించి, నేనే చెప్పుకొనవలసి రావడం నా దురదృష్టం! అది అక్షరాలా మహా కావ్యమే ప్రభూ! అది రత్నగిరి ప్రభువుల

కంట పడకుండా అక్కడి వారు కుట్రలు పన్ని నన్ను దేశం నుండి పంపివేశారు. నన్ను మీ దేశ పౌరునిగా ఉండనీయండి. నా సర్వశక్తులనూ ధారపోసి రచించిన ఆ మహా కావ్యాన్ని తమరొకసారి పరిశీలించి -"అంటున్నాడు కవి.

మధ్యలోనే ఉదయవర్మ ప్రభువులు, చే సైగతో కవిని ఆగవలసిం దన్నారు.

"మీరు మా దేశానికి రావడం మా అదృష్టం. మా దేశ పౌరులుగా ఉంటాననడం మరీ అదృష్టం. మీవంటి వారిని ఆదరించే అవకాశం భగవంతుడు మాకీ రూపంలో కలిగించా డనుకొంటున్నాను. మీరు కావ్యాన్ని గురించి ప్రస్తావించారు. దయచేసి ఆ సంగతి మాత్రం మరిచిపొండి" అన్నాడు ఉదయవర్మ.

అది రత్నవర్మను గురించి రాసిన కావ్యం కావడంవల్లా, ఉభయులూ ఇరుగు పొరుగు రాజులే కావడంవల్లా, తానా రాజుగారిమీద రాసిన కావ్యాన్ని. ఈ ప్రభువులు చూడడానికి ఇష్టపడడం లేదని కవిగారు గ్రహించారు.

అలా గ్రహించాక—

"అయ్యా! నా అభిప్రాయాన్ని ఇంతకు ముందు స్పష్టంగా చెప్పలేకపోయాను. నా ఉద్దేశమిదీ - ఆ కావ్యం. ప్రధానంగా రత్నగిరి ప్రభువుల అన్నదానాన్ని అభినందిస్తున్నట్టిది. అక్కడక్కడా రత్నగిరి రాజుగారి ప్రశంసకూడా అందులోఉంది. మీరా గ్రంథాన్ని చూడండి...ఆ ప్రభువుల పేరు ఉన్నచోట, దాన్ని కొట్టివేసి, తమ పేరు చేర్చి తమకు దాన్ని..." అని నసిగాడు కవి.

ఉదయవర్మ ఫక్కుమని నవ్వాడు.

"నాపట్ల మీకున్న అభిమానానికి చాలా కృతజ్ఞుణ్ని కవిగారూ! కావ్యాన్ని గురించి మరిచిపొమ్మనడంలో నా ఉద్దేశం.

దాన్ని నేను చదవలేననీ, అది - నా పొరుగు దేశ పాలకుణ్ని గురించి రాసిందనీ కాదు. ఒక మంచిపని ఎవరు చేసినా, దాన్ని అభినందించవలసిందే! రత్నవర్మగారు చేసింది సత్కార్యమని మీ రనుకొన్నారు. ఆ కార్యాన్ని స్వయంగా మీరు చూశారు ఆవేశం పొందారు. అనుభూతి చెందారు. మహా కావ్యం రాశారు. నేనా కావ్యాన్ని ఆనందించాలంటే, కావ్య వస్తువు నాకు తెలిసి ఉండాలి. రత్నవర్మ గారి గురించి నాకు తెలిసిందే బహు తక్కువ వారి అన్నదానాన్ని గురించి తెలిసింది మరీ మరీ తక్కువ. నిజం చెప్పాలంటే అన్నదానం గురించి, నాకు పిసరింత కూడా తెలియనే తెలియదు. మీ కావ్యం మొత్తం అన్నదానం గురించే కదా! అంటే నాకు తొత్తిగా పరిచయం లేని వస్తువే మీకు కావ్యవస్తు వయింది. కాబట్టి దాన్ని చదివి, నేనేదో ఆనందించగలనన్న అనుమానం నాకు లేదు. మీరు కూడా అటువంటి అపోహ పడకండి" అన్నారు ఉదయ వర్మగారు.

మహాకవి కొన్ని క్షణాలు ఆలోచించాడు. ఉదయవర్మగారికి అన్నదానం గురించి తెలీక పోవడమేమిటి? మహా ప్రభువులు, మనస్సులో ఏదో దాచుకొని ఇంకేదేదో పైకి మాట్లాడుతున్నా రేమో నన్న అనుమానం కవిగారికి కలిగింది.

"ప్రభూ! తమ సత్య సంధతను నేను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను. అన్నదానం గురించిన అనుభవం, తమకు లేదన్నారు. తమరు తలుచుకోవాలేగానీ అలాంటిది తమ అందుబాటులోకి రావడం క్షణాల మీద పని! మీరున్నా తక్షణమే అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించండి. ఆ అనుభవం పొందిన తరువాతనే కావ్యాన్ని పరిశీలించండి!" అన్నాడు కవి.

ఈసారి ఉదయవర్మ ప్రభువులు మరీ మరీ నవ్వారు.

"మహాకవీ! మీకు తెలిసిన విషయాలనే మరోసారి తమకు

గుర్తు చేస్తున్నాను... ఏ దానమివ్వడానికైనా దాన్ని పరిగ్రహించే వారుండాలి గదా! రత్నగిరి రాజ్య ప్రభువులు అన్నదానం చేస్తామని ప్రకటించగానే, దాన్ని అందుకోవడానికి వందలమంది, వేలమంది సిద్ధమయ్యారు. అంటే మరొకరు పిలిచి పెడితే తప్ప తిండి దొరకని ప్రజలు ఆ దేశంలో వేల సంఖ్యగా ఉన్నారన్నమాట! లేకపోతే అంతమంది ఎందుకు పోగు పడతారు? ఆ గుప్పెడు మెతుకులు అందుకోవడం కోసం ఎందుకలా బారులుతీరి నిలబడతారు? ఎందుకలా కుమ్ములాడుకుంటారు? యాచించడంలోని హీనత్వం తెలిసిన వారెవ్వరూ యాచించడానికి పూనుకోరు. ఇన్ని వేల మంది, మానాభిమానాలు కూడా విడిచి పిడికెడు తిండికోసం యాచిస్తున్నారంటే వారంతా అదోగతిలో ఉన్నారనుకోవాలి. లేదా - తేరగా ఎవడన్నా తిండి పడేస్తే, తిని బతకడానికి అలవాటు పడిన సోమరులయినా అయి ఉండాలి. నా దేశంలో సోమరులు లేరు. లేకపోగా మీరు - ఏ దాన మిచ్చినా పుచ్చుకోవడాని కెవరూ ముందుకురారు. ఎందుకని? నా ప్రజలకు కావలసినవన్నీ ఉన్నాయి గనక! అతి తక్కువ మంది చేతుల్లో అతి ఎక్కువ సంపదలు పేరుకుపోయినప్పుడు, అధిక సంఖ్యాకుల చేతుల్లో అసలు ఎలాంటి సంపదలూ లేనప్పుడు మాత్రమే, ఒకడు దానమివ్వడానికీ, ఎక్కువ మంది దానం పుచ్చుకోవడానికీ వీలు పడుతుంది. రత్నగిరి రాజ్య సంపద యావత్తూ నూరింట అయిదు వంతుల మంది దగ్గర పోగుపడి ఉంది. మిగిలిన 95 వంతుల మందీ దరిద్రులూ, పరమ దరిద్రులూ, పుట్టు దరిద్రులూనూ. దానాలు చేసి, పుణ్యం సంపాదించుకొనే అదృష్టం అయిదు వంతుల మందికిన్నీ, దానాల మీదనే ఆధారపడి బతికే అవకాశం మిగిలిన 95 వంతుల మందికిన్నీ ఆ రాజ్యంలో ఉన్నది. నా కర్మకాలిపోతే ఉదయగిరి రాజ్యంలో అలాంటి సామాజిక విధానం లేదు. ఇక్కడ—దానాలిచ్చి పుణ్యం సంపాదించుకొందామన్న మనుషులు

దొరకరు. దానం పుచ్చుకోవలసిన దుస్థితిలో ఉన్నవారు. అనలే దొరకరు. కాబట్టి — అన్నదానం చేయడం ద్వారా, అనుభవాన్ని సంపాదించి, ఆ అనుభవం ద్వారా తమ కావ్యాన్ని చదివి ఆనందించే మహదవకాశం భగవంతుడు నాకు లేకుండా చేశాడు. నన్ను మన్నించండి'' అన్నాడు ఉదయవర్మ.

— అని కథ ముగించింది బంగారు దోమ. ముగించి, 'ఎలా ఉంది?' అన్నట్టు నా వేపు చూసింది.

"కథకేం నిక్షేపంలా ఉంది. అందుకోసం కాదుగానీ, ఈ కథకూ, నీకూ ఉన్న సంబంధం ఎక్కడో నాకు బోధ పడకుండా ఉంది. ఉదయగిరి రాజ్యంలో నయినా దరిద్రం లేకపోవచ్చుగానీ, దోమలు లేకుండా పోలేదుగదా! అక్కడున్న దోమలన్నీ మామూలు దోమలా, నీకుమల్లే బంగారు దోమలా? అదిగాక - ఆ రాజ్యంలో దోమలు మాత్రమేనా - మిగిలిన ప్రాణులుకూడా బంగారం ప్రాణులుగా మారిపోయాయా? అసలు—అవి—అలాగా బంగారంవిగా మారడం ఎలా సాధ్యపడింది? ఇప్పటికీ—ఇప్పటికీ—ఉదయగిరి రాజ్యం ఉన్నదా? ఉంటే—దాని చహరాలేమిటి? ఏ దిక్కుగా వెళ్ళాలి? ఎంతదూరం వెళ్ళాలి? ఎంతకాలం వెళ్ళాలి? దయచేసి ఆ వివరాలన్నీ పొల్లుపోకుండా చెప్పుకురా, నాక్కావాలి" అన్నాను.

ఈ అనడంలో కాస్త తొందరపాటునూ, ఇంకాస్త ఆత్రుతనూ కనబరిచినట్టున్నాను. బంగారు దోమ పుస్తకం మీదనుంచి చప్పున ఎగిరి, అందనంత ఎడంగా వెళ్ళింది.

"చూశావా! నీ పాడుగుణం పోనిచ్చుకున్నావుగాదు. బంగారం అన్న ముక్క చెవిన పడంగానే, నీవు తోడేలువయిపోయావు. నేను గమనించడం లేదనుకోకు. ఉదయగిరి రాజ్యం వివరాలన్నీ నీకు కావాలా? ఎందుకు నాయనా? వాళ్ళు సుఖంగా బతుకుతున్నారంటే

కడుపు మంటగా ఉందిగదూ? చూడలేకపోతున్నావుగదూ? అక్కడ అప్పులకు అప్పులు బంగారం దొరుకుతుందేమో లాగించేద్దామను కొంటున్నావు గదూ? 'కా' దని నన్ను బుకాయించకు. నువ్వేదో మంచివాడి వనుకున్నాను. అనుకొని దగ్గరగా వచ్చాను. నువ్వు బంగారం, బంగారం, బంగారమంటూ కలవరించడం ప్రారంభించావు. నీ కలవరింత విన్నాక, నీకు దూరంగా ఉండడమే మంచిదేమో ననిపించింది. పుస్తకం మీంచి లేచి చక్కా వచ్చాను. ఒక్క సంగతి చెప్పు నాయనా! ఈ గదిలో నువ్వూ నేనూ తప్ప ఇంకెవ్వరూ లేరు గనక నిజం చెప్పు. ఇప్పటిదాక నేనా పుస్తకం మీదనే ఉన్నట్లయితే నువ్వేం చేసేవాడివి?" అన్నది దోమ నన్ను నిగ్గదీస్తూ.

చెప్పండి!

గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పండి!

నేనేం చేసేవాణ్ణో, ఏంచేసి ఉండేవాణ్ణో, నిర్భయంగా చెప్పండి!!

మీ కభ్యంతరం లేకపోతే—

ఇలాంటి పరిస్థితిలో మీరున్నప్పుడు, ఏం చేసేవారో నిష్కంకోచంగా బహిరంగంగా ప్రకటించండి. మీ కభ్యంతరం ఉంటే కనీసం మీకు మీరయినా చెప్పుకోండి.

—:o:—